క్లుప్తంగా

నేడు వివిధ వస్తువులకు బహిరంగ వేలం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వస్తువులకు మంగళవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ (ఇన్‌చార్జి) ఎం.అబ్దుల్ ఖదీర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ పక్కన ఏపీఐసీసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ లోని దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఈ వేలంలో 141 ఫ్రీజర్లు (ఒక్కొక్కటి రూ.18,900), 133 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు (ఒక్కొక్కటి రూ.15.525), 145 క్యాష్‌చెస్ట్‌లు (ఒక్కొక్కటి రూ.5,100), 454 స్కానర్లు (ఒక్కొక్కటి రూ.2837), 186 క్యాష్ కౌంటింగ్ మెషీన్లు(ఒక్కొక్కటి రూ.675)కు వేలం వేస్తామన్నారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారమే వేలం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 94407 85620, 95059 68533, 99493 51052 నంబర్లలో సంప్రదించాలన్నారు.

10న ఉత్తర ద్వార దర్శనం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటేశ్వర నగర్‌లోని భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు.

30 నుంచి సూర్యారాధన

ప్రకాశం నగర్: కొంతమూరులోని పద్మాక్షి నగర్‌లో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 12 వరకూ శత చండీ సహిత సూర్యారాధన నిర్వహిస్తున్నట్లు పద్మాక్షి సేవా సమితి వ్యవస్థాపకుడు వడలి కుమార్ శర్మ తెలిపారు. సేవా సమితి రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది పీఎల్ఎన్ ప్రసాద్, దేవీ ప్రకాష్, ఈవని కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

2,530 కేజీల రేషన్ బియ్యం సీజ్

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి బుర్రిలంకలో రోడ్డు పక్కనే అక్రమంగా నిల్వ ఉంచిన 2,530 కిలోల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం ఎంఎస్‌వో కె.సూర్య ప్రభాకర్ సోమవారం సీజ్ చేశారు. డీఎస్‌వోకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బుర్రిలంకలో రోడ్డు పక్కన బస్తాల్లో ఉంచిన బియ్యాన్ని గుర్తించామన్నారు. వాటిని పరిశీలించగా, రేషన్ బియ్యంగా తేలిందన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి 49 బస్తాల్లో నింపిన 2,530 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని సీజ్ చేసి, కడియంలోని వెంకట సూర్యసుబ్బరాయ రైసుమిల్లులో భద్రపరిచినట్టు తెలిపారు.

రూ.20 వేల కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన విశాఖ పట్నం రానున్నారని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయబోమని ప్రకటన చేయాలని, దీనితో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లు విడుదల చేసి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి జీఎస్టీ, ఇతర ట్యాక్సులను మూడు నెలల పాటు వేయకుండా ఉంటే పరిశ్రమ పుంజుకుంటుందన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

రాజమహేంద్రవరం రూరల్: అసభ్య ప్రవర్తనపై మోరంపూడి అంబేడ్కర్ బొమ్మవీధికి చెందిన మహిళ ఆదివారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. ఆ మహిళ ఎస్వీ జనరల్ మార్కెట్‌లో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో గత నెల 30వ తేదీన ఆమె స్నేహితుడిని ఐదుగురు యువకులు ఆపి.. ఆమె ఫోన్ నంబర్ తీసుకున్నారు. అనంతరం ఆ మహిళకు ఫోన్ చేసి బెదిరించారు. అలాగే ఈ నెల మూడో తేదీ రాత్రి ఇంటికి వచ్చి గొడవ చేశారు. ఆమెతో ఒక యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావిచెట్టుకు రీప్లాంటేషన్

కంబాలచెరువు: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో 90 ఏళ్ల రావిచెట్టుకు రీప్లాంటేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరయ్యారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి అడ్డు వస్తున్న కారణంగా, కోర్టు కోరిక మేరకు ఈ రావివృక్షానికి 40 రోజుల ట్రీట్మెంట్ చేసారు. అనంతరం దీనిని పోలీస్ క్వాటర్స్‌లో రీప్లాంటేషన్ చేయనున్నారు.

ఏసీవై రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



ఏసీవై రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఏసీవై రెడ్డి అని, ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జెండా పంజా రోడ్డులోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఏసీవై రెడ్డి విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏసీవై రెడ్డిలోని రాజకీయ నిబద్ధత, ఉండవల్లి అరుణ్ కుమార్‌లోని పరిశీలనా దృక్పథం నాడు కాంగ్రెస్ పార్టీలో తన ప్రగతికి సోపానాలు అయ్యాయన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలలో ఏసీవై రెడ్డిని మించిన రాజకీయ వేత్త మరొకరు ఉండరన్నారు. విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన మద్దూరి అన్నపూర్ణయ్య సేవాసమితి సారథులు రౌతు సూర్యప్రకాశరావు, బెజవాడ రంగారావును ఆయన అభినందించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏసీవై రెడ్డి అనుసరించిన ప్రజాసేవా దృక్పథం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గన్ని కృష్ణ, టీకే విశ్వేశ్వర రెడ్డి, ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి, డాక్టర్ అనసూరి పద్మలత, రెడ్డి రాజు, పంతం కొండలరావు, పాలసానపల్లి హనుమంతరావు, పోలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లేష్



నియామక పత్రం అందుకుంటున్న మల్లేష్

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన లద్దిక మల్లేష్ నియమితులయ్యారు. వై.జంక్షన్‌లోని ఈట్ అండ్ ప్లే కన్వెన్షన్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, రాష్ట్ర ఇన్‌చార్జి యలాగుల నూకాలమ్మ నియామక పత్రం అందజేశారు. అలాగే రాష్ట్ర కన్వీనర్‌గా చొల్లంగి వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దాలిపర్తి వేమన, బత్తుల నాగేశ్వరరావు, రూరల్ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కన్నాబత్తుల ఆనందరావుకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నూకాలమ్మ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు లద్దిక మహేష్ నియామకం చేసినట్లు తెలిపారు. అనుబంధంగా ఎన్నో కమిటీలు పనిచేస్తాయని, అయితే ఇప్పుడు చేసిన నియామకాలు మెయిన్ టీమ్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణరాజు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర పూర్వాధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు, బీసీ నాయకులు కేకే సంజీవరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరిక్ మందుల షాపు వద్ద ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కాళీకృష్ణ మహిళా శక్తి సంఘ సభ్యులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని జనరిక్ మందుల దుకాణాన్ని ఖాళీ చేయాలంటూ నగరంలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారంటూ సోమవారం కొందరు మహిళలు ఆందోళన చేశారు. దీంతో ఆ దుకాణం వద్ద ఇరువురి మధ్య గొడవ జరిగింది. మీకు సమయం అయిపోయింది ఖాళీ చేయాలంటూ కొందరు, మేము తిరిగి అగ్రిమెంట్ చేయించుకున్నామంటూ ప్రస్తుత నిర్వాహకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ మందుల దుకాణం నిర్వహిస్తున్న కాళీకృష్ణ మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు పిల్లా తనూజ మాట్లాడుతూ తమను బలవంతంగా ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. కొంతకాలంగా మందుల దుకాణం నిర్వహిస్తున్నానని, 2024 నుంచి 2029 వరకు దుకాణం తనకు కేటాయిస్తున్నట్లు జిల్లా సమాఖ్య తీర్మానించిందన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తండ్రి అప్పారావు తన మనుషులతో దౌర్జన్యంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సహాయంతో తాను ఈ దుకాణం నిర్వహిస్తున్నానని, దీన్ని స్థానిక టీడీపీ నాయకులు ఖాళీ చేయించేందుకు దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభ మాట్లాడుతూ కాళీ కృష్ణ మహిళా శక్తి సంఘానికి మందుల దుకాణం నిర్వహించేందుకు సమయం అయిపోయిందన్నారు. దీంతో వేరే మహిళా సంఘానికి కేటాయింపు జరిగిందన్నారు. గత మూడు నెలలుగా దీనిపై నోటీసులు ఇస్తున్నామన్నా స్పందన లేదన్నారు. కాగా.. దుకాణం నిర్వహణ సమయం పూర్తయితే టెండర్ ద్వారా లీజుకు ఇవ్వాలే కానీ, ఇష్టారాజ్యంగా నచ్చిన వారికి కేటాయించడమేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



పోటీలో పాల్గొన్న బాడీ బిల్డర్లు

రాజమహేంద్రవరం రూరల్: కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని గౌతమీ వ్యాయామ కళాశాలలో అడ్డూరి నారాయణరావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఈస్ట్ అండ్ వెస్ట్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 150 మంది హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఈ కళాశాల వ్యవస్థాపకుడు అడ్డూరి నారాయణరావు తనకు అత్యంత సన్నిహితులన్నారు. ఆయన కుమారుడు రమణమూర్తి 20 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పోటీల్లో కాకినాడకు చెందిన జి.హేమంత్ చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా, ఎస్.రమేష్ రన్నర్‌గా నిలిచారు. కార్యక్రమంలో యర్రా వేణుగోపాలరాయుడు, అనుశ్రీ సత్యనారాయణ, ప్రవీణ్ నాయుడు, మురుకుర్తి జగన్‌మోహన్‌రావు, ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: మధ్యవర్తిత్వం, రాజీమార్గ పథక సంఘం శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకూ ఐదు రోజుల పాటు మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందన్నారు. సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 24 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వ నైపుణ్య శిక్షణ అందించడానికి ఢిల్లీకి చెందిన సీనియర్ శిక్షకులు అనూజ సక్సేనా, మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ శిక్షకులు నీన ఖరేలతో 40 గంటల మధ్యవర్తిత్వం తర్ఫీదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, వివిధ జిల్లాలకు చెందిన అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీటీఆర్ఐ: అవుట్ సోర్సింగ్ మున్సిపాలిటీ కార్మికులను సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ సీతారామమూర్తికి వినతి పత్రాన్ని అందించారు. ఆ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంఎన్నికల ముందు అనేక హామీలు వర్షం కురిపించి.. అధికారంలోకి వచ్చాక ప్రజలకు నిరాశ మిగిల్చిందన్నారు. నగర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వి.భీమశంకర్ పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి 120 అర్జీలు స్వీకరించారు. డీఆర్‌వో టి.సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా పార్కుల అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పార్కులన్నింటిని దశల వారీగా అభివృద్ధి చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. లాలాచెరువు స్పిన్నింగ్ కాలనీలో జాతీయ రహదారిని ఆనుకొని రూ.రెండు కోట్లతో నిర్మించిన పిల్లల పార్కును రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థలో లాలాచెరువు పంచాయతీ విలీనమైన తర్వాత అనేక మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు.

వడివడిగా రబీ

- జోరుగా సాగుతున్న పనులు
- దమ్ములు, ఊడ్పులతో రైతులు బిజీబిజీ
- 30 శాతం పూర్తయిన నాట్లు



దుళ్లలో పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

కడియం: రబీ పనులు చురుకుగా జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించడంతో రైతులు దమ్ములు, ఊడ్పులతో బిజీబిజీగా ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 3,200, కడియం మండలంలో 4,900 ఎకరాల్లో రబీలో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వీటిలో రూరల్ మండలంలో 2,120, కడియం మండలంలో 1600 ఎకరాలకు పైగా నాట్లు పూర్తయినట్టు చెబుతున్నారు.

ఎంటీయూ 1121 రకమే అధికం

ప్రస్తుత రబీ సీజన్‌లో ఎంటీయూ 1121 రకం వరిని 98 శాతానికి పైగా రైతులు సాగు చేస్తున్నారు. రానున్న వేసవి వాతావరణానికి ఈ రకం వంగడం అనుకూలంగా ఉండడంతో దీని వైపే మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. పొలాన్ని దమ్ము చేయడం, నాట్లుకు మడులు సిద్ధం చేయడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయిస్తున్నారు. సహజ సాగు విధానాలను అనుసరించేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. వివిధ రకాల కషాయాలు, వేపనూనె తదితర వాటిని వినియోగించడం ద్వారా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించడంతో పాటు పెట్టుబడులను కూడా అదుపు చేయవచ్చునని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అందని పెట్టుబడి సాయం

గత ప్రభుత్వ హయాంలో ఈ సమయానికే పెట్టుబడి సాయం అందేదని, కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు అందలేదని పలువురు రైతులు తెలిపారు. హమాలీ, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా ఇంకా అందలేదంటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రకటించిన విధంగా పెట్టుబడి సాయాన్ని వెంటనే అందజేయాలని కోరుతున్నారు.

వేగంగా ఊడ్పులు

ప్రస్తుత సీజన్‌లో వరి నాట్లు వేగంగా సాగుతున్నాయని కడియం మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. వరి నారుమడులు కూడా ఆరోగ్యంగానే ఉన్నాయన్నారు. మండలం పరిధిలో ముప్పైశాతానికిపైగా నాట్లు వేశారన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతులను చైతన్య పరుస్తున్నట్లు ఏవో తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ తెలిపారు. పిడింగొయ్యి గ్రామానికి చెందిన పెనుమత్స రామ్మూర్తి రాజు తన 300 గజాల స్థలంలో ఫెన్సింగ్ తీసి గోడ కడుతుండగా కొందరు వచ్చి ఆ స్థలం తమదని అంటున్నారన్నారు. దానిపై పరిశీలించి చర్యలు చేపట్టాలని అర్జీ దాఖలు చేశారు. కాతేరు గ్రామానికి చెందిన గారపాటి సూర్య భాస్కరరావు డ్రైనేజీలలో పూడికలు తీయించాలని అర్జీ ఇచ్చారు.

క్రీడాకారిణి ఉషాజ్యోతికి ఆర్థిక సాయం



ఉషాజ్యోతికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

ప్రకాశం నగర్: స్నూకర్ నేషనల్ సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపికైన ఎస్‌కేవీటీ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని పసుపులేటి దేవీశ్రీ నీలిమ ఉషాజ్యోతికి బ్యాండ్‌బాక్స్ కృష్ణ సోమవారం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా రూ.30 వేలు అందజేశారు. అలాగే మంత్రి కందుల దుర్గేష్ ఆ విద్యార్థినికి రూ.10 వేలు వ్యక్తిగతంగా ఇచ్చారు. పోటీలలో పాల్గొనేందుకు ఉషాజ్యోతి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో నగర కాపు సంఘం నాయకులు జగదీష్ తదితరులు బ్యాండ్‌బాక్స్ కృష్ణను సంప్రదించగా, ఆయన సాయం అందించారు. కార్యక్రమంలో నగర కాపు సంఘం నాయకులు జక్కంపూడి అర్జున్, బడే బసవ, విద్యార్థిని తండ్రి సురేంద్ర పాల్గొన్నారు.

390 కోడి కత్తుల స్వాధీనం



నిందితుడు రాము, కోడి కత్తులతో పోలీసులు

కంబాలచెరువు: సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడిపందేల కోసం కత్తులు తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొర్లమ్మపేటలోని ఐదో వీధిలో కొసన రాము తన సొంత ఇంటిలో కోడి కత్తులు తయారు చేస్తున్నాడు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై చాగంటి రామకృష్ణ, సిబ్బంది రామకృష్ణ, శ్రీనుతో కలిసి ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా రాము నుంచి 390 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో ముగ్గురికి జైలు

కంబాలచెరువు: మహిళను అవమానపర్చి, దాడి చేసిన ఘటనలో ముగ్గురికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ వీఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి సోమవారం తీర్పు నిచ్చారు. అలాగే రూ.రెండువేలు చొప్పున జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. సుబ్బారావు నగర్‌కు చెందిన మురా కొండబాబు 2021 జనవరి 13న తన ఇంటి వద్ద కేకలు వినిపించి బయటకు వచ్చి చూశాడు. ఆ సమయంలో అతడి చెల్లి, బావతో ఆ ప్రాంతానికే చెందిన చెక్క నవీన్, చెక్క నాగార్జున, పెయ్యాల రాజు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కొడుతున్నారు.కొండబాబు ఆపడానికి ప్రయత్నించగా అతడిపై కూడా దాడి చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన త్రీ టౌన్ ఎస్సై సాగర్‌బాబు దర్యాప్తు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నేర నిరూపణ కావడంతో దాడి చేసిన ముగ్గు,రికీ పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీ మోహనరావు వాదించారు. ప్రస్తుత త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరావు కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను అందించారు. వీరిని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రత్యేకంగా అభినందించారు.

సోమేశ్వరాలయంలో విశేష పూజలు



పార్థివ లింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

కడియం: మురమండలోని సర్వకామదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మద్దుల వెంకట్రావు, సత్యదుర్గావాణి దంపతులు ఆలయంలో లక్షల రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మహాత్రిపుర సుందరీ సమేత పంచ సహస్ర పార్థివ లింగార్చన, అభిషేక హవన మహారుద్రకల్పం నిర్వహించారు. విశ్వశాంతి, లోకకళ్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

లైసెన్సు లేకుండా విక్రయిస్తున్న మందుల పట్టివేత



మందులను తనిఖీ చేస్తున్న డ్రగ్స్ ఏడీ నాగమణి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు

కంబాలచెరువు: లైసెన్సు లేకుండా అనధికారికంగా విక్రయిస్తున్న మందులను సోమవారం జిల్లా ఔషధ నియంత్రణశాఖాధికారులు పట్టుకున్నారు. సంబంధిత మందుల విక్రేతను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఒక అద్దె ఇంటిలో లైసెన్సు లేకుండా బీరక లక్ష్మణ్ కుమార్ మందుల అమ్మకాలు సాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన డ్రగ్స్ ఏడీ నాగమణి బృందం ఆ ప్రాంతంలో ఆకస్మిక దాడి చేసింది. ఈ సందర్భంగా వారికి సుమారు 55 రకాల మందులు కనిపించాయి. వాటితో పాటు రెండు రకాల కాలం చెల్లిన మందులను గుర్తించారు. వెంటనే వాటిని సీజ్ చేసి కోర్టుకు అప్పగించారు. లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్న లక్ష్మణ్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ఏడీ నాగమణి మాట్లాడుతూ అనధికారికంగా మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. దాడిలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎ.కృష్ణ, ఎన్‌వీవీఎస్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి

కడియం: బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి కిషోరి వికాసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణ పొందుతున్న శిక్షకులు తర్వాత వారి గ్రామాల్లో కమిటీలుగా ఏర్పడి పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరిగిన అనేక అంశాలను గుర్తు చేస్తూ, పిల్లలపై నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు అమలవుతాయన్నారు. మండల కన్వీనర్ గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కిషోరి వికాసం పథకం 2017లో ప్రారంభమైందన్నారు. హెచ్ఈవో రామకృష్ణ మాట్లాడుతూ బాలికల్లో ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. సీహెచ్‌వోలు రాము, కుందన సాయి న్యూట్రిషన్, పర్సన్ హైజింగ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆకుల నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, డీసీపీయూ క్రాంతిలాల్ బాలిక సంరక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో మండలంలోని 11 గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



యాళ్ల సురేష్‌ను పరామర్శిస్తున్న ముద్రగడ, వేణు, గూడూరి, జక్కంపూడి గణేష్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విద్యుత్ కాలనీలో వైఎస్సార్ సీపీ నేత యాళ్ల సురేష్, ఆయన కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు పరామర్శించారు. యాళ్ల సురేష్ తల్లి సూర్యకాంతం ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొమ్మూరులో పిల్లా బాబీ, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు తోట రామకృష్ణ, పెద్ద, గణేశుల రాంబాబు, పెంటకోట నాగబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా సమగ్ర శిక్షా ఎంఎంవో గౌరీ శంకరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, పరిశోధనా దృక్పథాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలను వివరించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర, స్వయం ఉపాధి నైపుణ్యాలను పెంచేందుకు బోధనా పద్ధతుల మార్పులు, పరిశోధనాత్మక ఆలోచనల ప్రోత్సాహానికి ప్రయత్నం వంటి వాటిపై జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ నెహ్రూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు లక్ష్మి, ఆంజనేయులు, జిల్లా మేనేజర్ ఉదయ్ కుమార్, ఎంపిక చేసిన 40 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.